## ఎంవోయూతో నూతన ఆవిష్కరణలు



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుందర్ కుమార్, వర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ప్రొఫెసర్ ఫణిశ్రీ

సుల్తాన్ బజార్, డిసెంబర్ 19: ఆలోచనలను మెరుగుపర్చుకునేందుకు ఎంవోయూలు దోహదం చేస్తాయని, అవి నూతన ఆవిష్కరణలకు చేయవచ్చని జేఎన్ఏఎఫ్ఏ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్ కుమార్ అన్నారు. మంగళవారం మాసాబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో రీసెల్యూట్ సంస్థ, ఏ ఆర్–వీ ఆర్ కోర్సుల శిక్షణ ఇచ్చే సీ మ్యాక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో రిసొల్యూట్ సంస్థ హెడ్ లీగల్ అండ్ ఐపీ ఆర్ అడ్వకేట్ సుభజిత్ సాహా, సీ మ్యాక్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు ఆర్కిటెక్ట్ గౌరీ శంకర్‌తో ఆయన వేర్వేరు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. విశ్వ విద్యాలయాలు తమ అధ్యాపకులు, విద్యార్థులకు ఉన్నతమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వివిధ సంస్థలతో ఒప్పందం చేసుకోవాలన్నారు. ఒప్పంద కార్యక్రమం వర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ప్రొఫె సర్ డాక్టర్ వి.ఫణిశ్రీలో సమక్షంలో కొనసాగింది.

## ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



శ్రీరంగనాథస్వామి దేవస్థానం వద్ద బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జియాగూడ కార్పొటర్ దర్శన్, బేగంబజర్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, ఆలయ ట్రస్టీ శృంగారం తిరువెంగళాచార్యులు, శేషాచార్యులు, బద్రీనాథాచార్యులు

జియాగూడ, డిసెంబర్ 19 : రంగనాథస్వామి ఆలయంలో వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, బేగంబజర్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, ఆలయ ట్రస్టీ శృంగారం తిరువెంగళాచార్యులు, ప్రధాన అర్చకులు శేషాచార్యులు అన్నారు. మంగళవారం దేవస్థానంలో జియాగూడ, బేగంబజార్ కార్పొరేటర్లు, కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మహ్మద్ జావీద్, ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శృంగారం శేషాచార్యులు మాట్లాడుతూ.. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 23 నుంచి జనవరి 16 వరకు ముక్కోటి ఉత్సవాలు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. మూడురోజులు శ్రీరంగనాథస్వామికి ప్రత్యేక అలంకరణ, అర్జిత సేవలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంఘ సేవకులు డీవీఎస్ రాజు, సందీప్‌లాల్ యాదవ్, రాజేందర్ డెగాన్ పాల్గొన్నారు.



రోగులకు నాణ్యమైన సేవలు అందించడంపై గోల్కొండలోని ఏరియా దవాఖానలో మంగళవారం వైద్యులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా పలు అంశాలపై సూచనలు అందించారు. కార్యక్రమంలో క్వాలిటీ మేనేజర్ రాము పాల్గొన్నారు. - మెహిదీపట్నం, డిసెంబర్ 19

# అధికారులతో సమావేశం నిర్వహించాలి

### సీఎంకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, చిత్రంలో జడ్సీ వెంకటేశ్ దోత్రే

అబిడ్స్, డిసెంబర్ 19 : జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రభుత్వానికి పెద్ద ఎత్తున రెవెన్యూ పన్నుల రూపేణా వస్తున్నా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిధుల లేమిని అధికారులు కారణం చూపడంపై గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రేతో కలిసి వివిధ విభాగాల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. అభివృద్ధి విషయమై జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, జీహెచ్ఎంసీ కమిషనర్, కాంట్రాక్టర్లు, వివిధ విభాగాల అధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి పనులు జరిగేలా చూడాలని కోరారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**అధికారులు నిధులు లేవంటున్నారు..**

నియోజకవర్గంలో అభివృద్ధి విషయంలో అధికారులను కోరితే నిధులు లేవని, కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గం ప్రజలకు ఏ విధమైన సమస్యలు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో నిధుల విడుదలకు గాను ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. నిధులు విడుదలై పెండింగ్‌లో ఉన్న పనులను ఐదు రోజుల్లో ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంట్రాక్టర్లను పనులు తొందరగా పూర్తి చేయాలని ఆదేశిస్తే బిల్లులు రావడం లేదని సాకులు చెబుతున్నారని, వెంటనే కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేసి పనులు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జోన్ ఎస్ఈ సహదేవ్ రత్నాకర్, ఈఈ ప్రకాశం, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సయ్యద్ సయీదుద్దీన్, డీఈలు పాల్గొన్నారు.

## మాలధారులకు వసతులు కల్పించాలి



అయ్యప్ప మాలధారులపై జరుగుతున్న పోలీసు లాఠీచార్జి, ఇబ్బందులపై తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల ప్రభుత్వాలు కేరళ ప్రభుత్వంతో మాట్లాడాలని అయ్యప్ప ఐక్య వేదిక ప్రతినిధులు కోరారు. మంగళవారం ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి కార్యాలయంలో తెలంగాణ అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించింది. అయ్యప్ప ఐక్య వేదిక ప్రతినిధులు బుచ్చిరెడ్డి గురుస్వామి, బాలకృష్ణ గురుస్వామి, క్యాతం రాధాకృష్ణ గురుస్వామి, ప్రేమ్‌గాంధీ గురుస్వామి మాట్లాడుతూ.. శబరిమలైలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో అక్కడి ప్రభుత్వం విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని శబరిమలైలో ఐదు ఎకరాలలో భవనం నిర్మించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు.

- అబిడ్స్, డిసెంబర్ 19

## సన్మానం



ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును సచివాలయంలో మంగళవారం రాష్ట్ర మేరు, దర్జీ టైలర్స్ యువజన సంఘం నాయకులు సన్మానించారు. సంఘం అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రటరి పొల్కం శ్రీనివాస్ మంత్రికి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. - అబిడ్స్, డిసెంబర్ 19



ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ చైర్మన్ గౌరి సతీశ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలోని ఆయన కార్యాలయంలో కలిసి సన్మానించారు.

- అబిడ్స్, డిసెంబర్ 19



నగర అదనపు కమిషనర్ రంగనాథ్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్.వి. మహేందర్ కుమార్ ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు రంగనాథ్ ప్రత్యేక చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. - అబిడ్స్, డిసెంబర్ 19

## 'నాగలి కూడా ఆయుధమే' పుస్తకావిష్కరణ



తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో విల్సన్‌రావు కొమ్మువరపు కవితా సంపుటి నాగలి కూడా ఆయుధమే .. పుస్తకావిష్కరణ, అంకితోత్సవ సభ మంగళవారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాన్ విచ్చేశారు. పుస్తకాన్ని ఆవిష్కరించి ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె. శ్రీనివాస్ అంకితం చేశారు.ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ.. విల్సన్‌రావు కొమ్మువరపు కవితా సంపుటి అద్భుతంగా ఉందని, నాగలి వ్యవసాయ దారుడికి ఆయుధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో దార్ల వెంకటేశ్వరావు, ఎం.నారాయణశర్మ, డా.కోయి కోటేశ్వరరావు, కె.శివారెడ్డి పాల్గొన్నారు. - రవీంద్రభారతి,డిసెంబర్ 19

## జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం



తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, లతా రాజ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, సంగీత విద్యాంసురాలు ప్రేమ రామమూర్తికి జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. మంగళవారం రవీందభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వక్తలుగా రిటైర్డ్ ఐఆర్‌టీఎస్, పద్మశ్రీ, ఎస్ఎన్ఏ అవార్డు గ్రహీత డాక్టర్ ఆనంద్ శంకర జయంత్, అశ్విని సుబ్బారావు, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ డీన్ కె.వి.అచ్చలపతి విచ్చేశారు. ప్రేమ రామమూర్తి కూతురు డాక్టర్ జయప్రద రామమూర్తి వివాహం చేసుకోకుండా ఫ్లూట్ వాయిద్యంలో పేరు సంపాదించి తల్లికి పురస్కారం ఇవ్వడం అభినందనీయమని వక్తలు కొనియాడారు.

- రవీంద్రభారతి, డిసెంబర్ 19

# ఒగ్గు కళాకారుడికి డాక్టరేట్



రవికుమార్‌కు డాక్టరేట్ పట్టాను అందజేస్తున్న కిషన్‌రావు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 19 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లలిత కళాపీఠం రంగస్థల కళల శాఖలో డాక్టర్ కోట్ల హనుమంతరావు పర్యవేక్షణలో ప్రఖ్యాత ఒగ్గు కళాకారుడు, వస్తాదు బిస్మిల్లా ఖాన్ జాతీయ పురస్కార గ్రహీత చౌదరిపల్లి రవికుమార్ 'ఒగ్గుకథ – నాటకీయ లక్షణాలు' అంశంపై విస్తృత పరిశోధనలు చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు గాను డాక్టరేట్ అందుకున్నారు. సోమవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య తంగెడ కిషన్‌రావు తన చాంబర్‌లో డాక్టరేట్ పట్టాను రవికుమార్‌కు ప్రదానం చేశారు. విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి అభినందించారు.

## పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా విద్యాధికారి రోహిణి, ఆసిఫ్‌నగర్ డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లుతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై అధికారులతో చర్చించారు. - మెహిదీపట్నం, డిసెంబర్ 19

## పనులు సకాలంలో పూర్తి చేయండి



అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రోస్‌ను ఎమ్మెల్యే కలిసి పలు విషయాలపై చర్చించారు. కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులతో చర్చించి పనులు ప్రారంభం అయ్యేలా చూస్తానన్నారు.

- మెహిదీపట్నం, డిసెంబర్ 19